
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







బెజ్జంకి లక్ష్మీనృసింహస్వామి ఏకశిల గుట్ట వద్ద వరుసలో బండ్లు


లక్ష్మీనర్సింహస్వామి గోవిందా గోవిందా

బెజ్జంకిలో అంగరంగ వైభవంగా శకటోత్సవం.. ఏకశిల గుట్ట చుట్టూ తిరిగిన బండ్లు

బెజ్జంకి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, కార్లు, ట్రాలీ ఆటోలు, బైక్‌లు, డోజర్లు, ఎక్స్‌కవేటర్లు, హార్వెస్టర్లు ఏకశిల గుట్టుచుట్టూ తిరుగుతూ లక్ష్మీనర్సింహస్వామి గోవిందా గోవిందా అంటూ బెజ్జంకి ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బెజ్జంకి మండల కేంద్రంలోని నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన శకటోత్సవ కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా కొనసాగింది. ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైంది. ముందు ఎడ్లబండ్ల ఉండగా, తర్వాత మిగతా వాహనాల ప్రదక్షిణ కొనసాగింది. ఒకదాని తర్వాత ఒకటి రయ్ రయ్ మంటూ వెళుతుంటే అటు వాహనాల శబ్దం, మరోవైపు లక్ష్మీనర్సింహస్వామి నామస్మరణతో హోరెత్తింది. శకటోత్సవంలో మేకల బండి ప్రధాన ఆకర్షణగా నిలిచింది.



శకటోత్సవ వేడుకల్లో తిరుగుతున్న ఎడ్లబండ్లు



సిద్దిపేట రావిచెట్టు హనుమాన్ ఆలయంలో పల్లకీ సేవలో హరీశ్‌రావు

జైహనుమాన్

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా అంజన్న ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పట్టణాల్లో శోభాయాత్రలను నిర్వహించారు. సిద్దిపేటలో రంగధాంపల్లి హనుమాన్ ఆలయం నుంచి పలు చౌరస్తాల మీదుగా రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా వరకు శోభాయాత్ర హోరెత్తింది.

- సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి)

సిద్దిపేట బీజేఆర్ చౌరస్తాలో...



సిద్దిపేట పట్టణంలో శోభాయాత్ర



గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ వెనుక గల స్థలం

హద్దులు లేవు.. కంచె కరువు

- ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు శూన్యం
- మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలపై పలువురి కన్ను
- ప్రహరీ నిర్మాణం, హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు

9



నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

9

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

తాగునీటికి తండ్లాట

జిల్లాలో మొదలైన నీటి ఎద్దడి

- ఏప్రిల్ తొలినాళ్లలోనే తాగునీటికి ఇబ్బందులు
- అడుగంటుతున్న బోర్లు, బావులు
- మిషన్ భగీరథ నీటి సరఫరాలోనూ సమస్యలు
- వాటర్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న పరిస్థితి
- బిందెలతో రోడ్డెక్కుతున్న వైనం



దౌల్తాబాద్ మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 12 : జిల్లాలో తీవ్రమైన తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏప్రిల్ నెల మొదట్లోనే ఈ పరిస్థితి తలెత్తడం ఆందోళనను కలిగిస్తోంది. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్యలను అధిగమించడం అధికార యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు సవాల్ అని చెప్పక తప్పదు. గత వర్షాకాలం సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. దీంతో భూగర్భజలాలు తక్కువగా ఉన్నాయి. ఇక మిషన్ భగీరథ సరఫరాలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాగునీటి కోసం వాటర్ ట్యాంకర్లను, ప్లాంట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

పాతాళంలో భూగర్భజలాలు

గతేడాది మార్చి నెలలో 11.24 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా ఈ సంవత్సరం మార్చిలో 13.82 మీటర్లకు పడిపోయాయి. గతేడాది మే నెలలో 12.05 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. ఈ లెక్కన ఏప్రిల్ నెలలోనే అట్టడుగుస్థాయికి జలాలు పడిపోయినట్లుగా అర్థమవుతోంది. మార్చిలోనే అనూహ్యంగా భూగర్భజలాలు పడిపోవడం ఆందోళనను కలిగించింది. గడిచిన ఐదేళ్లలో ఇలా అడుగంటిపోవడం ఇదే తొలిసారి. మళ్లీ వర్షాలు కురిస్తేనే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంటుంది. లేదంటే వచ్చే రెండునెలల్లోనూ తాగునీటి ఇబ్బందులు తప్పకపోవచ్చు. అక్బరుపేట-భూంపల్లి, దౌల్తాబాద్, దుబ్బాక, కుకునూరుపల్లి, మర్కుక్, మిరుదొడ్డి, సిద్దిపేట రూరల్ మండలాల్లో 15 మీటర్ల లోతున జలాలు ఉండడం గమనార్హం.

జిల్లాలో వివరాలు

నెల	భూగర్భజలాలు (లోతు మీటర్లలో)
జనవరి	10.85
ఫిబ్రవరి	12.13
మార్చి	13.82

సమస్యలు.. నిరసనలు

వేసవిలో తాగునీటి సమస్యలు ఎక్కువవుతున్నాయి. మిషన్‌భగీరథ నీటి సరఫరా ఉన్నప్పటికీ పలుచోట్ల అంతరాయం కలుగుతోంది. ఇక పంచాయతీ బోర్లు, బావులు సైతం అడుగంటుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో తాగునీటి కోసం నిరసనలు వ్యక్తపరుస్తున్నారు. సిద్దిపేట అర్బన్ మండలంలో మిషన్ భగీరథ నీళ్లు శుభ్రంగా రావడం లేదని వాటర్ ప్లాంట్లలో ఫిల్టర్ నీళ్లు కొంటున్నారు. ఒక్కో క్యానుకు రూ.15దాకా వసూలు చేస్తున్నారు. కోహెడ మండలం సముద్రాలలో తాగునీటి కోసం సిద్దిపేట-హుస్నాబాద్ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. దుబ్బాక మండలం ఆరెపల్లిలో మంచినీటి సమస్య రావడంతో ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెప్పించుకుంటున్నారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో మిషన్ భగీరథ నీళ్లు సరిపడా రావడం లేదు.

నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల్లో మిషన్ భగీరథ వాటర్ పైపులైన్ మరమ్మతులు ఉన్నాయని సరఫరా నిలిపివేశారు. బోర్ల ద్వారానే నీటి సరఫరా జరుగుతోంది. తాగునీటి కోసమైతే వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో రెండ్రోజులుగా తాగునీళ్లు రాకపోవడంతో ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నారు.



కోహెడ మండలం సముద్రాలలో తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు(ఫైల్)

తెలంగాణ అంటేనే కవుల ఖిల్లా

- ప్రతీ ఒక్కరికి కాలమే గుణపాఠం నేర్పుతుంది
- రచయిత అందెశ్రీ
- రంజింపజేసిన సుద్దాల అశోక్ తేజ శ్రీశూద్ర గంగ కావ్య గానం



ఆత్మీయంగా హత్తుకున్న అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అంటేనే కవుల ఖిల్లా అని, ఎంతోమంది తెలంగాణ నుంచి ఉన్నారని తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ అన్నారు. సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో శనివారం సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ కావ్య గానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అందెశ్రీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి కాలమే గుణపాఠం నేర్పుతుందని, కొన్నేళ్లుగా చాలా ఓర్పుతో ఉన్నామన్నారు. సుద్దాల అశోక్ తేజ శ్రీశూద్ర గంగ పుస్తకం గురించి ప్రస్తావిస్తూ ఈ పుస్తకం రాయడానికి బలమైన కారణం ఉందన్నారు. సుద్దాల పాదాలను కన్నీటి బిందువులతో కడగాలని ఉందని, చరణగతి గంగా అంటూ వేదిక మీదనే అశోక్ తేజకు అందెశ్రీ పాదాభివందనం చేశారు. అంతకుముందు శ్రీశూద్ర గంగ కావ్య గానంతో సుద్దాల అశోక్‌తేజ ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేశారు. కావ్యం ఎందుకు రాయాల్సి వచ్చింది, దాని నేపథ్యం గురించి వివరించారు. కావ్యగానం మధ్యలో చలోక్తులు విసురుతూ సభను రంజింపజేశారు. ఈ సందర్భంగా రచయిత, జర్నలిస్టు విష్ణుప్రసాద్ రాసిన తేగ మురిసే మేక అనే కవితా సంపుటిని సభ వేదికపై పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో మరసం జిల్లా అధ్యక్షుడు రంగాచారి, సిద్దెంకి దయాకర్, భూపతి వెంకటేశ్వర్లు, అన్నవరపు దేవేందర్, తైదల అంజయ్య, సువర్ణాదేవి, గ్యాదరి పరమేశ్వర్, శ్రీహరి యాదవ్, గోపాలస్వామి, ప్రభాకర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



నంగునూరు మండలం రాజగోపాల్‌పేటలో రైతును ఓదార్చుతున్న హరీశ్‌రావు

రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం

తక్షణమే పంట నష్ట పరిహారం చెల్లించాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు/నంగునూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. వడగళ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని కోరారు. శనివారం ఆయన చిన్నకోడూరు, నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాళ్ల వర్షం రైతుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల బీమా పథకాన్ని అమలు చేస్తానన్న రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైన అతిగతి లేదన్నారు.

హరీశ్‌రావు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పంట పొలాల మధ్య రైతులతో గడిపారు. వడగళ్ల వర్షానికి ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మిరప, కీరదోస, మామిడి తోటలను పరిశీలించారు. తమను ఆదుకోవాలని, రైతుబంధు డబ్బులు పడలేదని, రుణమాఫీ కాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావుతో రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో గ్రామంలో రైతులు మల్లయ్య, అంజయ్య హరీశ్‌రావు కాళ్లపై పడి కన్నీటి పర్యంతం కాగా వద్దని వారించి వారిని ఓదార్చారు. ఎల్లాయిపల్లి, చెల్కలపల్లిలో పలువురు మహిళ రైతులు తమ కష్టాలను మొరపెట్టుకుంటూ కన్నీరు కార్చగా, వారిని ఓదార్చారు. అన్నదాతల ఆవేదనకు చలించిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన చెందవద్దని, అండగా ఉంటానని వారికి ఆత్మవిశ్వాసం నింపారు. అంతకుముందు గోనెపల్లి శివారులో మత్తడి దూకుతున్న చెక్‌డ్యాంను, పారుతున్న వాగును చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఇబ్రహీంనగర్‌లోని ఓ హోటల్‌లో సామాన్యుడిలా రైతులతో కలిసి టిఫిన్ చేశారు.

మళ్లీ కేసీఆర్ కావాలంటున్నారు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక కార్యక్రమాన్ని శనివారం శనివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఈ నెల 27న పెద్ద ఎత్తున తరలాలని, పల్లెల్లో, వార్డుల్లో పార్టీ జెండా ఎగరవేయాలని సూచించారు. 14 ఏళ్ల పోరాటం, ఉద్యమ పంథా చరిత్ర ఉన్న గులాబీ జెండాకు పురుడు పోసిన గడ్డ సిద్దిపేట అని, సిద్దిపేట 25ఏళ్ల కీర్తి ఈ మట్టి బిడ్డలకే ఉందన్నారు.



చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో మత్తడి దూకుతున్న చెక్‌డ్యాంను చూస్తున్న హరీశ్‌రావు

ఆస్తి పంచివ్వాలంటూ తండ్రిపై కత్తితో దాడి

● తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిక

నర్సాపూర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆస్తి పంచి ఇవ్వాలంటూ తండ్రిపై కొడుకు కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికి చెందిన వడ్ల దశరత్ కొడుకు నాగరాజు మద్యానికి బానిసై పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. కొంతకాలంగా ఆస్తి పంచివ్వాలని తండ్రితో గొడవపడుతున్నాడు. శనివారం కూడా భూమి పంచి ఇవ్వాలని తండ్రితో గొడవకు దిగాడు. జులాయిగా తిరుగుతున్నందున ఆస్తి రాసివ్వనని తండ్రి తెలుపడంతో ఆగ్రహానికి గురైన నాగరాజు ఇంట్లో నుంచి కత్తి తీసుకుని దాడి చేయడంతో దశరత్ తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని కుటుంబీలు స్థానికుల సహాయంతో మొదట నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.









విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి రైతు బలి

● గాలివానకు పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలు
● మరమ్మతులు చేయాలని కోరినా పట్టించుకోని వైనం
● గమనించకుండా తాకడంతో మృతి

పుల్‌కల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి అన్నదాత బలైన సంఘటన పుల్కల్ మండలం మిన్‌పూర్ గిరిజన తండాలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆ తండాకు చెందిన రమావత్ రమేశ్(32) పొలం మీదుగా ఉన్న విద్యుత్ లైన్ తీగలు రెండు రోజుల క్రితం గాలి దుమారానికి తెగి కింద పడ్డాయి. వీటిని సరి చేయాలంటూ పలువురు రైతులు లైన్‌మన్ దృష్టికి తీసుకువెళ్లగా.. తన ఇంట్లో శుభకార్యం ఉందని, తరువాత సరిచేస్తానంటూ పట్టించుకోలేదు. శుక్రవారం సాయంత్రం తన వరి పొలానికి నీళ్లు పారబెట్టేందుకు వెళ్లిన రమేశ్ తీగలను గమనించకుండా తాకడంతో విద్యుఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు రాత్రి పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా పడి కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ అక్కడికి చేరుకుని శవ పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడికి భార్య లత, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తెగిపడిన విద్యుత్ తీగలను సరిచేయాల్సిన లైన్‌మన్, హెల్పర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే రమేశ్ ప్రాణాలు కోల్పోయాడని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి మండల కాంగ్రెస్ తరఫున రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి తెలిపారు.


ఘటనా స్థలంలో రమేశ్ మృతదేహం

స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పిన బైక్

● గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి

చేగుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండల పరిధిలోని కర్నాల్‌పల్లిలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన కత్తెర బాలయ్య(50) శుక్రవారం దౌల్తాబాద్ మండలం ఇందుర్పురియాకి బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. కర్నాల్‌పల్లి గ్రామంలో భారీగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్‌పై వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.


బాలయ్య (ఫైల్)

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు..

ఎమ్మెల్యే ఆదేశాలను అధికారులు బేఖాతరు చేయడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయడని పలువురు ఆరోపించారు. చేగుంట నుంచి గజ్వేల్‌కి వెళ్లే రహదారిపై కర్నాల్‌పల్లిలో భారీగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని వారం క్రితం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారి వెంకటేశంను ఆదేశించారు. అయినా తొలగింపునకు చర్యలు తీసుకోలేదు. అధికారులు వెంటనే స్పందించి ఉంటే ప్రమాదం జరిగి ఉండేదే కాదని అభిప్రాయపడుతున్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వర్గల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు దొంగలను గౌరారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌరారం గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన కిరాణా దుకాణంలో ఈ నెల 10న చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన వేముల చంద్ర ప్రకాశ్ (27), రాజన్న సిరిసిల్ల జిలా కోనరావుపేటకు చెందిన గాజుల హేమంత్ (19)ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నేరాన్ని ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి రూ.800 నగదు, దొంగతనం సమయంలో షెట్టర్ లేపడానికి ప్రయత్నించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ములుగు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు అలవాటు పడి చేసిన అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని జప్తిసింగాయపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీలం శ్రీవర్ధన్‌రెడ్డి(34) చెడు వ్యసనాలకు అలవాటు పడి ఎలాంటి పనులు చేయకుండా ఇంటి వద్దనే ఉంటూ పలువురి వద్ద అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాల్లో తెలియక కుటుంబ సభ్యులతో చెబుతూ మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి నీలం బాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


శ్రీవర్ధన్‌రెడ్డి(ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డం పెంటారెడ్డి (72) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 3 న ఇంట్లో మంచంపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు మంచంపై నుంచి కింద పడడంతో తలకి గాయమైంది. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



పాముకాటుతో రైతు మృతి

గజ్వేల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాండవుల శ్రీనివాస్(38) తన వ్యవసాయ పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. శనివారం ఉదయం పంటకు నీళ్లు కడుతున్న సమయంలో నాగుపాము కాటు వేయడంతో వెంటనే కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారికి సమాచారం చేరవేశాడు. దీంతో వారు అతడిని మొదట గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య మమత, ముగ్గురు కుమారులు ఉన్నారు.


శ్రీనివాస్(ఫైల్)

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

తూప్రాన్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్ పట్టణ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణంలోని చెట్లతిమ్మాయిపల్లి పరిధి నడిమి తండాకు చెందిన కత్రోత్ గోపాల్(55) తన బంధువుల వివాహానికి శుక్రవారం మోపెడు వాహనంపై నర్సంపల్లి తండాకు వెళ్లాడు. శనివారం సాయంత్రం నర్సంపల్లితండా నుంచి నర్సంపల్లి గ్రామానికి వస్తుండగా.. కిష్టాపూర్ నుంచి నర్సంపల్లి వైపు వస్తున్న హిటాచి జేసీబీ లోడ్‌తో ఉన్న లారీ వెనుకా నుంచి అతి వేగంతో గోపాల్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అతడు లారీ టైర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


లారీ కిందపడి మృతి చెందిన గోపాల్

చెరువులో పడి వ్యక్తి మృతి

చేగుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి)చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. చేగుంట పట్టణానికి చెందిన గోరంట్ల వెంకటేశం(53) గ్రామ శివారులోని ఊర చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడికి భార్య వజ్రమ్మ, ఇద్దరు కొడుకులు ఉన్నారు.


వెంకటేశం(53)

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పుల్‌కల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి గ్రామ శివారులో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ శనివారం తెల్లవారు జామున సిబ్బందితో కలిసి సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో బొలెరో(టీఎస్15యూతః 0179)లో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం అదించగా, వారు పరిశీలించి రేషన్ బియ్యమేనని నిర్ధారించారు. ఆ మేరకు డ్రైవర్‌తో పాటు యజామానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

కోహెడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగసముద్రాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జనార్ధన్‌రెడ్డి తన ట్రాక్టర్‌లో మెక్కజొన్నను లోడ్ చేసుకుని సిద్దిపేటలో విక్రయించడానికి శనివారం బయలుదేరారు. మండలంలోని బస్వాపూర్ ఐకేపీ కేంద్రం సమీపంలో హనుమకొండ సిద్దిపేట ప్రధాన రహదారిపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో ట్రాలీ బోల్తా పడింది. ఆ సమయంలో ట్రాలీలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

● హెచ్‌సీయూ ఎస్‌ఎఫ్‌ఐ నేత ఎర్ర నవీన్

● కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు నుంచి విడుదల




అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంది, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : అరెస్టులు, జైలు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్‌సీయూ ఎస్‌ఎఫ్‌ఐ నేత ఎర్ర నవీన్ అన్నారు. (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) భూముల వేలం ఆపాలని యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న యూనివర్సిటీ విద్యార్థి సంఘం నేత ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ జాయింట్ సెక్రెటరీ పీహెచ్‌డీ స్కాలర్ ఎర్ర నవీన్ శనివారం ఉదయం కంది సెంట్రల్ జైలు నుంచి విడుదల య్యారు. ఆయనకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాలు, పూలమాలతో సన్మానించారు. టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేశారు. కందిలో అంబేద్కర్ విగ్రహానికి నవీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, కెవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్, వ్యాకాస జిల్లా కార్యదర్శి నర్సింహులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈ కృష్ణ, పి కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్, సహాయ కార్యదర్శి అర్జున్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థి సంఘం నాయకులు దీపక్, అంతేక్, దిలీప్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

అక్షర శిల్పికి అరుదైన పురస్కారం

● తెలుగు జర్నలిస్ట్ సంఘం (ఏపీ) పురస్కారానికి సిద్దిపేట వాసి ఏజాజ్ ఎంపిక



ఎజాజ్ అహ్మద్

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగంలో అపూర్వ సేవలందించిన సిద్దిపేటకు చెందిన ప్రముఖ చేతి రాత నిపుణులు, వ్యాఖ్యాత ఎజాజ్ అహ్మద్ విద్య విభాగంలో ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ చేతుల మీదుగా ఈ అవార్డును ఎజాజ్ అహ్మద్ అందుకున్నారు. ఉగాది పురస్కారంలో భాగంగా నగదు, ప్రశంసా పత్రం, రూ. 20 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందించారు.

అందమైన చేతిరాత పుస్తకానికి అద్భుత ఆదరణ

టిక టిక టిక, టిక, టికొక్కటి.. అంటూ అందమైన చేతి రాతను సులభంగా వ్రాసే మెళకువలు నేర్పే ఎజాజ్ అహ్మద్ వీడియోను యూట్యూబ్‌లో 40 దేశాల్లో 10 కోట్లకు పైగా మంది ఇప్పటికే వీక్షించారు. సులభమైన రీతిలో సున్నాలు, గీతలతో లక్షలమంది చేతి రాతను అందంగా తీర్చిదిద్దారు. పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులకు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో చేతి రాతపై సుమారు 3వేల శిక్షణా తరగతులు నిర్వహించారు. అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే అనే పుస్తకానికి రూపకల్పన చేశారు. ఆ పుస్తకం 150 పునర్ముద్రణలు పొందింది అంటే ఎంత ఆదరణ పొందిందో అర్థం చేసుకోవచ్చు.

ఆకట్టుకుంటున్న మహేశ్ తీసిన చిత్రాలు



ఆర్ట్ గ్యాలరీలో మహేష్ చిత్రాల ప్రదర్శన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరుగుతున్న చిత్ర ప్రదర్శనలో సిద్దిపేటకు చెందిన సామలేటి మహేష్ తీసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 12నుంచి 14 వరకు మాదాపూర్ తెలంగాణ స్టేట్ ఆర్ట్ గ్యాలరీ శిలానిశ్శబ్దం పేరిట చిత్ర ప్రదర్శన కొనసాగుతుంది. భాష సంస్కృతి శాఖ నేతృత్వంలో కళాయజ్ఞం, టార్చ్ సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు. జనవరి 25, 26న ప్రముఖ చిత్రకారుడు ఏలూరి శేషాబ్రహ్మం నేతృత్వంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 60 మంది కళాకారులతో కాకతీయ టెంపుల్ స్కెచ్ స్టడీ టూర్ చేపట్టారు. పలువురు చారిత్రక కట్టడాలను సంబంధించిన చిత్రాలను అక్కడికక్కడే గీశారు. సిద్దిపేటకు చెందిన మహేష్ వరంగల్, పెద్దపల్లి జిల్లాలోని కాకతీయుల కాలం నాటి పలు చిత్రాలను తన కెమెరాలో బంధించారు. ఈ క్రమంలోనే ఆయా వాటిలో ఎంపిక చేసిన చిత్రాలతో ప్రదర్శన చేపట్టారు. అందులో మహేష్ తీసిన రెండు చిత్రాలు ప్రదర్శనకు ఎంపిక అవ్వడం విశేషం. ఈ సందర్భంగా పలువురు కళాభిమానులు సామలేటి మహేష్ ప్రదర్శించిన చిత్రాలను చూసి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, శేషాబ్రహ్మం, అరవింద్ ఆర్య, శ్రీరామోజు హరగోపాల్, కంది నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

హద్దులు లేవు.. కంచె కరువు

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు శూన్యం

● మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలపై పలువురి కన్ను

● ప్రహరీ నిర్మాణం, హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు



గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ వెనుక గల కంచే, బోర్డు లేని స్థలం

గజ్వేల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో భూమి విలువలు ఆకాశాన్నంటిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గజం భూమి దొరికిన వేలల్లో డబ్బులు దక్కే అవకాశం ఉండడంతో ప్రభుత్వ స్థలాలపై పలువురు కబ్జాదారులు కన్నేశారు. ఈ క్రమంలోనే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో కంచెలు, బోర్డులు లేని ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. గతంలోనూ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమైన విషయం తెలిసిందే. తూప్రాన్ రోడ్డులోని ఓ భూమి ఆక్రమణ విషయంలో అప్పట్లో పెద్ద పంచాయతీ జరగగా, వివాదాస్పద భూమి అధికారుల ఎంట్రీతో ప్రభుత్వ భూమిగా తేలింది. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ భూముల పక్కన ఇండ్లను నిర్మించుకున్న, భూములను కొనుగోలు చేసినవారు పక్కనే ఉన్న భూమిని ఆక్రమించుకోవడం అలవాటుగా మారిపోయింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ, దేవాదాయ, మునిసిపల్, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూములకు ప్రహరీని ఏర్పాటు చేస్తే వాటి ఆక్రమణలు జరిగే ఆస్కారం ఉండదు.

ఐవోసీ భవనం వెనుక గల భూమిపై పలువురి కన్ను

గజ్వేల్ పట్టణంలోని సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయం(ఐవోసీ) వెనక గల స్థలంపై పలువురు కన్ను వేసినట్లు తెలుస్తోంది. గతంలో ఐవోసి నిర్మించిన క్రమంలో దాదాపు 20 గుంటల భూమిని వదిలేశారు. ఈ భూమి సంగాపూర్ రోడ్డుతో పాటు హౌసింగ్ బోర్డు-ముట్రాజ్‌పల్లికి వెళ్లే రోడ్డుకు అనుసంధానంగా ఉండడంతో గజం విలువ రూ.30 వేల పైనే ఉంటుంది. సదరు భూమికి బోర్డు, కంచే, ప్రహరీ లాంటివి లేకపోవడంతో అన్యాక్రాంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా మునిసిపాలిటీ పరిధిలోని ఐవోసీ వెనుక గల కోర్టు పరిధిలో ఉన్న దేవాదాయ శాఖ భూమికి సంబంధించిన హద్దులను దాటి పలువురు ప్రహరీని నిర్మించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మినీ స్టేడియం వద్ద గల భూమిని సైతం పలువురు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీ పరిధిలో రెండు నర్సరీలు, ఎనిమిది పార్కులు, పది చోట్ల మున్సిపల్ స్థలాలు ఉండగా, పలు ప్రభుత్వ కార్యాలయాలను ఐవోసీలోకి మార్చడంతో సదరు స్థలాలు, భవనాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. పలు శాఖలకు సంబంధించిన భూములూ ఉన్నాయి. వీటిపై ఆయా శాఖలతో పాటు మునిసిపల్, రెవెన్యూ అధికారులు చొరవ చూపి ప్రహరీని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రహరీని ఏర్పాటు చేయాలి



గజ్వేల్ పట్టణంలోని ఆయా ప్రభుత్వ స్థలాలు, పార్కులు, నర్సరీలకు సంబంధించిన స్థలాలకు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలకు సంబంధించిన స్థలాలకు ప్రహరీని ఏర్పాటు చేయాలి. చాలా చోట్ల కనీసం బోర్డులు లేకపోవడంతో అన్యాక్రాంతం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ అధికారులు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు స్పందించి కంచే లేదా ప్రహరీని ఏర్పాటు చేయాలి.

-సందబోయిన ఎల్లయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

స్థలాలను ఆక్రమిస్తే సహించం



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం. ఎక్కడా ఆక్రమణలకు తావు లేకుండా చాలా చోట్ల ఇప్పటికే కంచె లేదా ప్రహరీని ఏర్పాటు చేశాం. మిగతా చోట్ల ఉన్న వాటికి కంచె లేదా ప్రహరీల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ప్రభుత్వ స్థలాలను కాపాడుతాం.

-గొల్కొండ నరసయ్య, మునిసిపల్ కమిషనర్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

● మెదక్ ఎంపీ రఘునందన్ రావు



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

నంగునూరు,ఏప్రిల్ 12: వడగళ్ల వర్షం తో నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నంగునూరు మండలం వెంకటాపూరు, ముండ్రాయి, నర్మెట్ట, మైసంపల్లి, పాలమాకుల, రాజగోపాల్ పేట గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన రైతులను ఓదార్చి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతులకు రుణ మాఫీ చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొండి పంచాయితీ పెట్టిందన్నారు. వర్షంతో ఎక్కువ శాతం నష్టం నంగునూరు మండలంలోనే జరిగిందని తెలిపారు. కౌల్ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సర్వే చేసి నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల రాష్ట్ర మంత్రులు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కోసమే మండలంలో పర్యటించారు తప్ప రైతుల కోసం కాదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులనుద్దేశించి వరికి బదులు తాలు పండిస్తున్నారా అని అంటూ ఎగతాళి చేసి మాట్లాడడం సరికాదన్నారు. రాళ్ల వర్షం వస్తే వడ్లు రాలి తాలు మాత్రమే మిగులుతుందన్న విషయం మంత్రులు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, యాదమల్లు, రజనీకర్ రెడ్డి నాంపల్లి శ్రీనివాస్, నారాయణ, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, కృష్ణ, సురేందర్ రెడ్డి, జ్యోతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నిర్మూలన అందరి సామాజిక బాధ్యత అని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అవగాహన పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల సమాజంలో యువశక్తి విచ్ఛిన్నమవుతుందన్నారు. పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలకను పని చేస్తోందని, పౌరులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం, రవాణ, సరఫరా చేయడం తీవ్రమైన నేరమని, వారి శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో తూప్రాన్ బాలుడి సత్తా



గ్రాండ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందుకుంటున్న జై సాయి దీక్షిత్

మనోహరాబాద్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ బాలుడికి దక్షిణ భారత్ ఓపెన్ కరాటేలో చాంపియన్‌షిప్‌లో పోటీలలో టైటిల్ కైవసం చేసుకున్నాడు. షోలిన్ కరాటే ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం కండ్లకోయలోని నిమ్మల కన్వెన్షన్ హాల్‌లో దక్షిణ భారత్ ఓపెన్ కరాటే కుంగ్ ఫు చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో భాగంగా 11 ఏళ్లలోపే కేటగిరీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోటీదారుల మధ్య జరిగిన పోటీలలో తూప్రాన్‌కు చెందిన జై సాయి దీక్షిత్ గ్రాండ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. దీక్షిత్ జ్ఞాని షోటోకాన్ అకాడమీ ద్వారా శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్లు కాశినాథ్, రంగు గణేష్ గౌడ్‌లకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం తూప్రాన్‌కు చెందిన క్రీడాకారుల మధ్య ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించిన అజయ్‌కుమార్



విజేతగా నిలిచిన అజయ్‌కుమార్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నేపాల్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయిలో శనివారం నిర్వహించిన పోటీల్లో అజయ్ కుమార్ తన సత్తా చాటాడు. ఈ పోటీల్లో ఇండియా, బుటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా సంగారెడ్డికి చెందిన యోగా గురువు అజయ్‌కుమార్ 35 ప్లస్ క్యాటగిరిలో అథ్లెటిక్స్ పురుష విభాగంలో 60, 100, 200 మీటర్లు, యోగాలో 4 బంగారు పథకాలు సాధించారు. 60 మీటర్ల పరుగు పందెంలో 6.25 సెకండ్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డుని నెలకొల్పారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ సంగారెడ్డి కలెక్టరేట్ వెనుక భాగంలో ఉన్న పార్కులో ఈ నెల 15వ తేది నుంచి అన్ని వయస్సుల వారికి శిక్షణ అందించి ప్రోత్సహిస్తానన్నారు.



అట్టహాసంగా రావణ దహనం

● జోగిపేటలో వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

జోగిపేట. ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): జోగినాథ స్వామి ఉత్సవాలలో చివరిది, ఉత్సవాలకే తలమానికమైన రావణ దహనం శుక్రవారం అర్ధరాత్రి నేత్రపర్వంగా జరిగింది. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వేదిక వద్ద తూర్పు అభిముఖంగా సుమారు 40 అడుగుల ఎత్తుతో పదితలలతో కూడిన రావణుడి భారీ ఆకారాన్ని రూపొందించారు. దీనితోపాటు అదే ఆవరణలో 3 చెట్లు పడగెత్తిన 3 భారీ నాగుపాము ఆకారాలను ఏర్పాటు చేశారు. రావణుడు తదితర ప్రతిమలలో భారీ టపాసులను, మందుగుండు సామాగ్రిని కూర్చారు. సోమవారం రాత్రి 1 గంట సమయంలో ఆనవాయితీ ప్రకారం జోగినాథ స్వామికి ఆలయ పూజారి భద్రయ్యస్వామి, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాకూరి శివశంకర్,సభ్యులు ఎస్. క్రిష్ణారెడ్డి, ఎస్. సురేందర్ గౌడ్, పీ. శివశేఖర్‌లచే ప్రత్యేక హారతి నిప్పటించారు. అనంతరం, రావణాసురుడి విగ్రహం వద్ద శివుడి చిత్రపటానికి ఆలయ కమిటీ సభ్యులచే ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం, మొదటగా చెట్లు, నాగుపాము ఆకారాలను పేల్చారు. వివిధరంగులతో కూడిన కాంతులను వెదజల్లుతూ అవి వెలిగి చూపరులను విపరీతంగా ఆకట్టుకున్నాయి.ఈఉత్సవాలకు మొదటగా, నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. జోగిపేట సీఐ అనిల్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పుల్కల్, వట్‌పల్లి స్టేషన్ల సిబ్బంది, ప్రత్యేక పోలీసులు బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేశారు.



జోగిపేటలో హాజరైన జనం

పాలిటెక్నిక్.. విద్యార్థుల భవితకు బంగారు బాట

● కోర్సు పూర్తిచేయగానే ఉద్యోగాలు లభించే అవకాశం

● దరఖాస్తుకు 19 వరకు గడువు



సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువు ఒక్క ఎత్తయితే ఉన్నత చదువులకు వెళ్లాలంటే పదిలో ఉత్తీర్ణులవ్వాల్సిందే. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆ తరువాత ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఎలాంటి కోర్సులు తీసుకోవాలి, ఏ విద్యాసంస్థలో చేరాలంటూ మదనపడుతుంటారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు ఉన్నతమైనదని చెప్పవచ్చు. కెరీర్ పరంగా జీవితంలో త్వరగా స్థిరపడాలకునే వారు పాలిటెక్నిక్‌లో చేరితే డిప్లొమా త్వరగా పూర్తి చేయవచ్చు. ఇంజనీరింగ్ పూర్తి చేయాలంటే ఇంటర్‌లో రెండు సంవత్సరాలు డిగ్రీలో నాలుగు సంవత్సరాల పాటు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్‌లో మూడేళ్లు చేయాలి. కానీ పాలిటెక్నిక్‌లో అలా కాదు మూడేళ్లలో ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేయవచ్చు. పాలిటెక్నిక్‌లో కంప్యూటర్స్ ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ ఇంజనీర్, సివిల్ ఇంజనీర్ లాంటి కోర్సుల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సులు ఉన్నాయి. ఇవి పూర్తి చేసిన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవచ్చు. అంతేకాకుండా ప్రైవేటు రంగాల్లో కూడా మెండుగా ఉద్యోగాలు లభిస్తాయి. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్ ద్వారా నేరుగా ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో చేరి మూడు సంవత్సరాల్లో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసే అవకాశం ఉంటుంది.

ప్రవేశాలు ఇలా..

పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశాలు పొందేందుకు అర్హులు. పాలిటెక్నిక్‌లో విద్యార్థుల ప్రవేశాలకు రాష్ట్రంలో ఉన్న అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక శిక్షణ సంస్థ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తుంది. పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 19వ తేది వరకు (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పాలిసెట్.సబ్‌టెట్.తెలంగాణ.గో.ఇన్) అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఎస్సీ ఎస్టీ కేటగిరీలకు చెందిన విద్యార్థులు రూ.250 ఫీజు ఉండగా ఇతర వర్గాల విద్యార్థులు రూ.500 ఫీజు చెల్లించాలి.

పదో తరగతి తరువాత పాలిటెక్నిక్ ఉత్తమం



పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్మీడియేట్‌తో పోల్చితే పాలిటెక్నిక్ ఎంతో ఉత్తమం. అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉంటుంది. డిప్లొమా అనంతరం ఈసెట్ ద్వారా మంచి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందవచ్చు. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయి.

-జానకిదేవి, ప్రిన్సిపాల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సంగారెడ్డి

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవిపల్లి, చింతమడక 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఏడిఈ శ్రీనివాస్ తెలిపారు.సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, మాచాపూర్, అంకంపేట, సీతారాంపల్లి, దమ్మచెరువు మరియు నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి, బంజేరుపల్లి, కోదండరావుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

చేర్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి సురేపల్లి నంద సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

తొగుట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులు సరే.. నాణ్యత ఏదీ?

- సీసీ రోడ్ల పనులకు రూ. కోట్లు ఖర్చు చేసినా బయటపడుతున్న డొల్లతనం
- నాయకులే కాంట్రాక్టర్లుగా మారడంతో ఇష్టారాజ్యంగా పనులు
- కుమ్మక్కైన అధికారులు పర్యవేక్షించడం లేదని ఆరోపణలు


కోహెడ మండలంలో క్యూరింగ్ లేని సీసీ రోడ్డు, బస్వాపూర్ గ్రామంలో సీసీరోడ్డుపై పగుళ్లు వచ్చిన దృశ్యం

కోహెడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలోని పలు గ్రామాల్లో గత 15 రోజులుగా కొనసాగుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రుపాయలు వెచ్చించి చేస్తున్న అభివృద్ధి పనుల్లో డొల్లతనం బయట పడటమే ఇందుకు కారణం. దీంతో పంచాయతీ రాజ్, ఉపాధిహామీ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల మనుగడ ప్రశ్నార్థకమైంది.

రూ. కోట్లు వెచ్చించినా..

కోట్ల రూపాయల నిధులు ఖర్చుచేస్తున్నా, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్యకర్తలు, నాయకులే కాంట్రాక్టర్లుగా మారి తమ ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్నారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించడం లేదు. రోడ్డు వేసిన అనంతరం క్యూరింగ్ కోసం నీరు పట్టాల్సిఉండగా అలా చేయడం లేదు. మండలంలో కాంగ్రెస్, బీజేపీ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. కోటీ 50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. స్థానిక ఎంపీ కేంద్రమంత్రి బండి సంజయ్ మండలానికి రూ.50 లక్షలకు పైగా నిధులు మంజూరు చేశారు. అలాగే స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.కోటికి పైగా ఈ నిధులను విడుదల చేయించారు. గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు ఇష్టానుసారం నాణ్యత లేకుండా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. చాలా గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు పగుళ్ల కనిపిస్తున్నాయి.

కరువైన అధికారుల పర్యవేక్షణ

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ లేకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడమే ఈ దుస్థితికి కారణమని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పాత సీసీ రోడ్డు పైనే మళ్లీ రోడ్డు నిర్మాణం కొనసాగుతుంది. బస్వాపూర్ గ్రామంలో పనులు ప్రారంభించి వారం రోజులు గడవకుండానే రోడ్డు బీటలువారడం చర్చనీయాంశంగా మారింది. కొత్త రోడ్డు నిర్మాణం జరిగి వారం రోజులు గడిచినా ప్రతిరోజూ నీరు పట్టకపోవడంతో బీటలువారాయి. రోడ్డు పనుల్లో నాణ్యతపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పనులను అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నాయకులే కాంట్రాక్టర్లుగా..

నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనులు చేపట్టడంతో సంబంధిత అధికారులు ఎవరూ కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. భారీ ఎత్తున ఎవరి వాటాలు వారు తీసుకుంటున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. నాణ్యతకు లేకుండా పనులు చేస్తున్నా, క్వాలిటీ కంట్రోల్ అధికారులు కానీ, పంచాయతీరాజ్ అధికారులు కానీ నోరుమెదపకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపంపై పంచాయతీ రాజ్ అధికారులను ఫోన్‌ద్వారా సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

ఎర్రవల్లిలో వివాహిత అదృశ్యం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ ఎర్రవల్లిలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుంచు లింగం 2వ కూతురు సుంచు రేఖ(23)కు భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లికి చెందిన రామగల్ల నాగరాజ్‌తో రెండు నెలల క్రితం వివాహమైంది. శనివారం రేఖ భర్తతో కలిసి గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బంధువుల వివాహానికి హాజరైంది. అక్కడి నుంచి ఆమె కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కోమటిచెరువును శుభ్రంగా ఉంచాలి


సిద్దిపేటలోని కోమటిచెరువును సందర్శించిన మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): కోమటిచెరువు ప్రాంతాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సిబ్బందికి సూచించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువును మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్వెంచర్ పార్క్ వద్ద విద్యుత్ శాఖ అధికారులు నరికివేసిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. డైనోసార్ పార్క్‌లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కట్టపైనున్న బాలవికాస్ తిరిగి వాడకంలోకి తీసుకురావాలని, వేసవి కాలం కాబట్టి సందర్శకులకు అతి తక్కువ ధరలో తాగునీరు అందుబాటులో ఉండేలా బాలవికాస్‌ను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. చెరువు కట్టపై ఉన్న మొక్కలకు డ్రిప్స్ ద్వారా నీరందేలా చూడాలని ఆదేశించారు. పరిసరాల్లో చెత్త డబ్బాలను అందుబాటులో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుచేసి మహిళలకు ప్రోత్సాహాన్ని అందించాలని డీఎంసీ హనుమంతరెడ్డికి సూచించారు. కమిషనర్ వెంట ఏఈ పృథ్వీ జవాన్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

హనుమాన్ జయంతి శోభాయాత్రలతో ఆధ్యాత్మిక సందడి


హుస్నాబాద్ అంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు


గజ్వేల్‌లో హనుమాన్ శోభాయాత్రలో హిందూ సంఘాల నాయకులు


కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలోని హనుమాన్ ఆలయంలో హోమం

హుస్నాబాద్ టౌన్/గజ్వేల్/చేర్యాల/వర్గల్/కుకునూరుపల్లి/మద్దూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. ఉదయం నుంచి ఆంజనేయస్వామి ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హనుమాన్‌చాలీసా పారాయణాలు నిర్వహించగా, వీధులు ఉత్సవ విగ్రహాల శోభాయాత్రలతో హోరెత్తాయి. హుస్నాబాద్ పట్టణంలోని పాటిమీద అంజనేయస్వామి ఆలయంలో శ్రీ పార్థసారధి గీతా భక్త సమాజం ఆధ్వర్యంలో గీతా పారాయణం, హనుమాన్ చాలిసా, గణపతి పూజ, అంజనేయ స్వామికి అభిషేకాలు, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గజ్వేల్‌తో పాటు ఆయా గ్రామాల్లో హైందవ సంఘాల నాయకులు, భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని శ్రీసీతారామ, ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి రాముడి, ఆంజనేయస్వామి ప్రతిమలతో శనివారం సాయంత్రం పట్టణంలోని పురవీధుల గుండా భారీ ర్యాలీని నిర్వహించారు. చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పలువురు హనుమాన్ మాలాధారణ చేపట్టారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామిఆలయ అనుబంధ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమత్ యజ్ఞం నిర్వహించారు.వర్గల్ మండల కేంద్రంలో హనుమాన్ శోభా యాత్రను గ్రామస్థులు, హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో ఘనంగా నిర్వహించారు. వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సీతారామ చంద్రమూర్తితో పాటు అంజనేయ స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా నాచగిరి క్షేత్రంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. మద్దూరు మండలంలో హన్మాన్ జయంతిని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.


సిద్దిపేట అర్బన్: బట్టి రామన్నపల్లి అంగన్‌వాడీలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ తదితరులు

సహజ సిద్ధంగా లభించే ఆహార పదార్థాలను తీసుకోవాలి

సిద్దిపేట అర్బన్/నంగునూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు సహజ సిద్ధంగా లభించే ఆహార పదార్థాలను తీసుకుంటే కావలసిన పోషక పదార్థాలు అందుతాయని ఐసీడీఎస్ అంగన్‌వాడీ అర్బన్ సెక్టర్ సూపర్‌వైజర్ సునీత సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల మధిర బట్టి రామన్నపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు నిర్వహించిన సీమంతంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లలిత, అంగన్‌వాడీ టీచర్ లత, హెల్పర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు. నంగునూరు మండలం రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్‌పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్ రేణుక మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు కాన్పు అయ్యేంతవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఎన్ఎం జ్యోతి క్లుప్తంగా వివరించారు.

మత రాజకీయాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం


సిద్దిపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మతాల మధ్యన చిచ్చు పెట్టి కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో అత్తుఇమామ్ మాట్లాడుతూ మైనారిటీలను అవమానిస్తున్న మోదీకి బుద్ధి చెప్పాలని, అందుకు రేపు హైదరాబాద్ లిబర్టీ వద్ద నిరసన కార్యక్రమానికి భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మోదీ తీసుకువచ్చిన ఉమ్మీద్ చట్టం వక్ఫ్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తాయన్నారు. బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఖయ్యూం ఖురేషి, అజ్మతుల్లా హుస్సేన్, నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, సలీం, ఫయాజ్, అనిల్, ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

గజ్వేల్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి


మల్లన్నసాగర్ కాలనీలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ క్రీడాకారులు కబడ్డీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీ ఎర్రవల్లిలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ చాంపియన్స్ ట్రోఫీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 26 మండలాలకు చెందిన క్లబ్ టీంలు, మహిళా విభాగంలో రాష్ట్ర స్థాయిలో పది జిల్లాల నుంచి ఆహ్వానిత కబడ్డీ జట్లు పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుఎస్సీ సంతోష్‌కుమార్, గజ్వేల్ మాజీ జడ్పీటీసీ వంగ మల్లేశం, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, ఆకారం లక్ష్మణ్, సుంచు యాదగిరి, నవీన్‌కుమార్, ప్రవీణ్ తదితరులున్నారు.

నెలాఖరులోగా న్యాక్ భవన్ అందుబాటులోకి తేవాలి

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట కరీంనగర్ రోడ్డులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న న్యాక్ భవనాన్ని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా నిర్మాణ రంగ నిరుద్యోగులకు వృత్తి నైపుణ్యం కోసం సిద్దిపేటలో న్యాక్ భవనం ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వంలో రూ.10 కోట్లు మంజూరు చేశామన్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి ఈ నెలాఖరులోగా న్యాక్ భవనం అందుబాటులోకి తేవాలని సూచించారు. దీంతో ఏటా 300 మంది నిర్మాణరంగ కార్మికులకు శిక్షణ లభిస్తుందని తెలిపారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సిద్దిపేటలోని శ్రీ రామరాజు రావిచెట్టు హనుమాన్ ఆలయంలో ఆంజనేయ స్వామివారికి నిర్వహించిన పల్లకిసేవలో మాజీమంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద హనుమాన్ స్వాములతో కలిసి భిక్ష స్వీకరించారు. అదేవిధంగా సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవాలతో పాటురాఘవాపూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ నరేష్ గౌడ్,నాయకులు వెంకట్, సంపంగి తిరుపతి, కంతుల రాజు, అశోక్ గౌడ్,యూత్ నాయకులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొండపాక/తొగుట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి మోసపోకుండా రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి బందారం, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు వాసరి లింగారావు, సీనియర్ నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు. తొగుట మండలం వర్ధరాజ్‌పల్లి, చందాపూర్, వెంకట్రావ్‌పేట, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, ఏవో మోహన్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, ఆర్ఐ అశోక్‌రాజ్, వివిధ గ్రామాల వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటలో నల్లబ్యాడ్జీలతో సీపీఐ నాయకుల నిరసన

'వక్ఫ్‌బోర్డు సవరణ'ను విరమించుకోవాలి

సిద్దిపేట అర్బన్/గజ్వేల్/చేర్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మైనార్టీల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే కుట్ర చేస్తోందని వక్ఫ్‌బోర్డు సవరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేటలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భట్టు దయానందరెడ్డి మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డు సవరణకు కొత్తగా చట్టం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, చింత శ్రీనివాస్, కానుగుల రమణాకర్, హమాలీ కార్మికులు తదితరులున్నారు. కేంద్రప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్‌బోర్డు బిల్లు రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం చేర్యాలలో ముస్లి సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక అంగడి బజారు చౌరస్తా వద్ద జనగామ-సిద్దిపేట ప్రధానరహదారిపై నిర్వహించిన రాస్తారోకోకు సీపీఐ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో ముస్లిం సంఘం నాయకులు ముఖీమ్, ఆదిల్, ఖాజా, నజీమ్, సీపీఐ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, నాయకులు పాల్గొన్నారు.

దౌలాపూర్‌లో ఆలయ వార్షికోత్సవాలు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌలాపూర్ గ్రామంలో బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. రెండోరోజు శనివారం గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. పెద్దమ్మ, పోచమ్మ, మహంకాళమ్మ దేవతలకు బోనాలు ఊరేగించారు. పెద్దమ్మ దేవాలయం వద్ద ఒగ్గు పూజారులు పటం వేసి పూజలు చేశారు. అలాగే దుర్గమ్మ గుడి దారు మైసమ్మ, దౌడాలమ్మ దేవతలకు పూజలు చేశారు. ఆదివారం వరకు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

గజ్వేల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వర ఆలయ బ్రహోత్సవాల సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన పలువురు నాయకులకు ఆహ్వాన పత్రికను ఆలయకమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి ఆయన స్వగృహంలో, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు దేశపతి రాజశేఖరశర్మ, చాడ నందబాలశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులున్నారు.

సన్నబియ్యంతో సంతోషంలో ప్రజలు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రేషన్‌కార్డు లబ్దిదారుడి ఇంటిలో రేషన్‌షాపు ద్వారా సరఫరా చేసిన సన్నబియ్యంతో వండిన అన్నాన్ని సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల కుటుంబాలు ఏ రకంగా సన్నబియ్యం అన్నాన్ని తింటున్నారో పేదలు కూడా అటువంటి అన్నాన్ని తినాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యాన్ని సరఫరా చేస్తుందని ఆయన తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోహెడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోహెడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఎన్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని శనివారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. సామాజిక కార్యకర్త వేల్పుల శంకర్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ లాంటి గొప్ప మేధావి జీవిత చరిత్రను ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ప్రముఖ గాయకులు బొనగిరి బాల తిరుపతి, శనిగరం రమేష్, రాచూరి మల్లేశం, జాలిగం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్సాన్‌పల్లిలో రెండువేల మందికి అన్నదానం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో ఓమౌజయాః ప్రజ్ఞాన క్షేత్రం ఆధ్వర్యంలో గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 2000 మంది కార్యక్రమంలో పాల్గొన్నారని క్షేత్రం సభ్యులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగుల ప్రశాంత్‌గౌడ్, భిక్షపతి, సత్యనారాయణ, కనకరాజు, చంద్రారెడ్డి, మల్లికార్జున్, నవీన్‌గౌడ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన జూపల్లి ఎల్లవ్వ, శివగల ఎల్లవ్వలు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలిసిన రిమ్మనగూడ బీజేపీ గ్రామ అధ్యక్షుడు గుడారం నవీన్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ. 5వేల చొప్పున అందజేశారు. వారివెంట శ్యాంకుమార్, షణ్ముఖగౌడ్, చందు, భీమ్‌కుమార్, సుధీర్, తలారి సాయి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేయాలి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అన్నీ అర్హతలున్నా తమకు జాబితాలో చోటు దక్కలేదని నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు ఆరోపించారు. శనివారం ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల జాబితా ఆన్‌లైన్‌లో పేర్లు రాని 14 మంది బాధితులు విలేకరుల ఎదుట తమ గోడు వెళ్లగక్కారు. సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల బాధితులు పెరుమాండ్ల బాలవ్వ, నీరటి శాంతవ్వ, పెరుమాండ్ల సర్వయ్య, బోయిని బాల్ లక్ష్మి, దుంపటి చంద్రకళ, చెప్యాల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్ర


జగదేవ్‌పూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు


రాయపోల్ మండలం కొత్తపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు


దూళిమిట్ట: ఉమ్మడి కొండాపూర్‌లో మాటాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


నంగునూరు: అక్కెనపల్లి పాదయాత్రలో కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

కొండపాక/జగదేవ్‌పూర్/రాయపోల్/దూళిమిట్ట/నంగునూరు/తొగుట/చేర్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ శనివారం పలు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ కోసమే కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ పాదయాత్ర చేపట్టినట్టు పునరుద్ఘాటించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలను కులాలు, మతాల పేరిట విభజించే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తుందని తెలిపారు. కొండపాక, జగదేవ్‌పూర్ మండలాల్లో నిర్వహించిన సంవిధాన్ పాదయాత్రలో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో సంవిధాన్ పాదయాత్ర అనంతరం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇతర నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కాగా పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో తమ గ్రామానికి సాగునీరు అందడం లేదు పంటలు ఎలా పండుతాయని పలువురు గ్రామస్థులు కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. అంతేగాకుండా ఒక్క బస్సు కూడా ఆగదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడతానని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మహిళలకు హామీ ఇచ్చి సముదాయించారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు చిట్టి దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలతో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మెన్ వంటేరు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉన్నారు. రాయపోల్ మండలంలో నిర్వహించిన సంవిధాన్ యాత్రలో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు ఆరేపల్లి నుంచి ముంగీస్‌పల్లి, రాంసాగర్ గ్రామాల మీదుగా కొత్తపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు. దూళిమిట్ట మండలంలోని ఉమ్మడి కొండాపూర్ గ్రామంలో నిర్వహించిన సంవిధాన్ పాదయాత్రలో డీసీసీ అధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. నంగునూరు మండలం అక్కెనపల్లి, కొండం రాజపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పాల్గొన్నారు. అంతకు ముందు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. తొగుట మండలంలోని వర్దరాజ్‌పల్లి, గోవర్ధనగిరి గ్రామాలు, చేర్యాల మండలం గుర్జకుంట, పాత దొమ్మాట, తాడూరు, చిట్యాల, దానంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంవిధాన్ పాదయాత్రలు నిర్వహిస్తూ రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.